క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

అరకులోయ రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో సుంకరమెట్ట పంచాయతీ దండబాడు గ్రామంలో విద్యార్థులకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. దాతల సాయంతో పుస్తకాలు, స్టేషనరీ, బ్యాగులు తదితర సామగ్రి తమ పిల్లలకు అందుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ చిన్నబాబు, ఉపాధ్యాయుడు సూకరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ రఘు, గిరిజన సంఘం నాయకులు గురుమూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



తుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పూర్ణిమ

హుకుంపేట: మండల కేంద్రంలో క్లాప్ మిత్రలు, కార్మికులు మంగళవారం తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వార్డు సభ్యుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సిబ్బంది

పాడేరు రూరల్(హుకుంపేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనం చిట్టిబాబు తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కాలేజీ ప్రాంగణంలో సిబ్బంది, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ పీవో గౌరీశంకర్, సిబ్బంది రసూల్, రమేష్, దామోదర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అల్లూరి



కృష్ణదేవీపేటలో అల్లూరి సమాధిని సందర్శించిన విద్యార్థులు

చింతపల్లి: అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని ఆయన నడయాడిన నేలలో, మనం ఉండడం గర్వకారణమని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు లీలా పావని అన్నారు. ఆమె మంగళవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులను కృష్ణదేవీపేటలోని అల్లూరి సీతారామరాజు సమాధుల వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అల్లూరి జీవిత విశేషాలను, ఆయన చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు.

రహదారులు జలమయం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. సంతబయలు గ్రామంలో జరిగిన వారపుసంత తడిచి ముద్దయ్యింది. సంతలో వస్తువుల విక్రయానికి వ్యాపారులు, దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. పాడేరు-జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు, సొలభం, లువ్వాసింగి, వంజరి, గెమ్మెలి, కుంబిడిసింగి జలమయమవడంతో వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు. పొలాల్లో వర్షపునీరు చేరింది. గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

జోరందుకున్న వరి నాట్లు

- ఊడ్పు పనుల్లో బెంగాలీ కూలీలు
- ప్రత్యేక పద్ధతుల్లో నాట్లు
- తెగుళ్ల నివారణకు అడ్డుకట్ట
- వేగవంతంగా పనులు



నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



ప్రత్యేక పద్ధతిలో బెంగాలీ కూలీలు వేసిన నాట్లు

రాజవొమ్మంగి: మండలంలో ప్రస్తుతం వరినాట్లు జోరందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు ఎక్కువగా చేరింది. దీంతో రైతులు సాగు పనులు ప్రారంభించారు. గత కొద్ది రోజుల క్రితం సాగునీటికి రైతులు ఇబ్బందులు పడినా...ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

దూర దూరంగా నాట్లు

మండలంలోని వరి నాటు పనుల్లో యూపీ, వెస్ట్ బెంగాల్, ఒడిశా నుంచి వచ్చిన కూలీల హవా కొనసాగుతోంది. ఆయా కూలీలు వరినాట్లను ప్రత్యేక పద్ధతిలో వేస్తున్నారు. ఈ పద్ధతిలో 16 మంది ఒక రోజులో 9 ఎకరాల్లో నాట్లు వేస్తుండడంతో ఈ పద్ధతికి గిరిజన రైతాంగం నెమ్మది నెమ్మదిగా అలవాటు పడుతున్నారు. వరినాట్లను దూర దూరంగా వరుస పద్ధతిలో వేస్తున్నారు. ముందుగా కలుపు మొక్కల తొలగింపు, ఆకు తీత పనులు చేపట్టి ఆ తరువాత నాట్లు వేస్తున్నారు. వరినాట్లు దూరం దూరంగా వరుసలో వేయడంతో సూర్యరశ్మి మొక్కకు బాగా తగలడంతో తెగుళ్లు సోకవరి తద్వారా మంచి దిగుబడి తక్కువగా కాలంలో వస్తుందని రైతులు చెబుతున్నారు. బెంగాలీ కూలీలు కాంట్రాక్ట్ పద్ధతిన ఎకరాకు రూ. 4,200 చెల్లిస్తే వరి ఆకు సేకరించడం (ఆకు తీత పనులు) తీసిన వరినారును నాట్లు వేసే పొలానికి తరలించడం, పొలంలో వరుసల పద్ధతిలో నాట్లు వేయడం వంటి అన్ని పనులు ఒకేసారి చేస్తున్నట్టు పలువురు రైతులు చెబుతున్నారు. సాధారణంగా సంప్రదాయ పద్ధతిలో ఒక ఎకరంలో నాట్లు వేసేందుకు 12 మంది మహిళలు అవసరమవుతారు. ఒక మనిషి కూలీ రోజుకు రూ.300లు..అదే విధంగా మనిషికి రూ.500 రోజు కూలీ చొప్పున ఆకుతీతకు ముగ్గురు మగవారు, తీసిన నారు పొలానికి తరలించేందుకు మరో ఇద్దరికి కూలీగా మొత్తం రూ. 2,500 వెరసి ఎకరాకు రూ.6,100 చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. కాగా బెంగాలీలకు కాంట్రాక్టు పద్ధతిన ఎకరాకు రూ.4,400 చెల్లిస్తే అన్ని పనులు వారే చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఖర్చు, సమయం కలసి వస్తుండడంతో స్థానిక రైతాంగం ఈ పద్ధతికే అలవాటు పడుతున్నారు. ఒక రోజులో చేసే పనిని బెంగాలీ కూలీలు గంటలోనే పూర్తి చేస్తుండడంతో 5 ఎకరాలు, పది ఎకరాల్లో వ్యవసాయం చేసే వారు ఈ పద్ధతిని ఎంచుకొంటున్నారు. అలాగే బెంగాలీలు తాడుకట్టి లైన్లలో దూరం దూరంగా వరి నాట్లు వేస్తున్నారు. దీనివల్ల పంటకు గాలి వెలుతురు సోకి పంట దిగుబడి బాగా పెరుగుతుందన్న అభిప్రాయాన్ని కూడా రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ఎడతెరిపి లేని వర్షాలకు వరి నారుమడులు ఏపుగా పెరిగాయి. సాగు భూముల్లోకి ఇబ్బడిముబ్బడిగా నీరు చేరింది. దీనితో ప్రతి రైతు ప్రస్తుతం వరి నాట్లు వేసే పనిలో బిజీ అయ్యారు. అందరు ఒకేసారి నాట్లు మొదలు పెట్టడంతో కూలీల సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారితో కూలీల సమస్య కూడా తీరిందని స్థానిక రైతులు అంటున్నారు.

సకాలంలో కూలి అందుతుంది



ఇక్కడ చేస్తున్న పనులకు సక్రమంగా సకాలంలో కూలి అందుతుంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఉత్తర ప్రదేశ్ నుంచి ఇక్కడికి పనులకు వస్తుంటాం. 16 మంది సభ్యులతో అన్ని చోట్ల పనులను చేస్తుంటాం. ముందుగానే ప్రాంతాల్లో పనులు కుదుర్చుకుంటాం. అందుకు అనుగుణంగా త్వరగా పనులు పూర్తి చేస్తాం. ప్రత్యేక పద్ధతిలో నాట్లు వేస్తున్నాం. దిగుబడి బాగుంటుంది.

– ఉత్తమ్‌రాయ్, కూలీ, ఉత్తరప్రదేశ్

గిరిజన చట్టాలపై అవగాహన



గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీలోని కొత్తవలస తదితర గ్రామాల్లో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు తదితరులు మంగళవారం పర్యటించారు. గ్రామస్తులకు గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనలో గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం, పీసా, అటవీ హక్కుల చట్టాలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. గిరిజన హక్కులు, చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈనెల 8న పాడేరులో నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జోషి, బుజ్జిబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెల్త్ అసిస్టెంట్ మృతి



మజ్జి అర్జున్(ఫైల్)

అరకులోయ రూరల్: మండలంలోని మాడగల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, బస్కి పంచాయతీ గగ్గుడు సబ్ సెంటర్‌లో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మజ్జి అర్జున్(49) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్నాళ్లుగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. అర్జున్ మృతికి సహచర సిబ్బంది, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి బాలదేవ్ తదితరులు సంతాపం తెలిపారు.

ఆకట్టుకున్న కళాజాత



కూనవరంలో కళాజాత నిర్వహిస్తున్న బృందం

కూనవరం: సికెల్‌సెల్ ఎనీమియా, డెంగ్యూ, మలేరియా,ఫైలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని కళాజాత ద్వారా తెలియజేస్తున్నట్టు కూనవరం వైద్యాధికారి సునీల్ కుమార్ తెలిపారు. మండలంలోని కూనవరం, కోతులగుట్ట, కూటూరు, టేకులద్ది గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కళాజాత ప్రజలను ఆకట్టుకుంది. చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య ఆదేశాల మేరకు రోజుకు నాలుగు గ్రామాల్లో కళాజాత ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కూటూరు వైద్యాధికారి శ్రీనివాసరావు దొర, ఎస్‌ఐ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు వినతి



బ్యాంకు అధికారులకు వినతిపత్రం ఇస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు తదితరులు

అనంతగిరి(అరకులోయ రూరల్): పాడి రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ గణేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన దేవరపల్లి యూకో బ్యాంకు అధికారులను మంగళవారం కలిసి పాడి రైతులకు రుణాల మంజూరు కోసం వినతిపత్రాన్ని అందజేశారు. పినకోట జూనియర్ వెటర్నరీ అధికారి సుధావాణి పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



దుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ, సిబ్బంది



హుకుంపేటలో చిన్నారికి అన్నప్రాశన చేస్తున్న సీడీపీవో బాలచంద్రమణిదేవి



లువ్వాసింగిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ, సూపర్‌వైజర్లు



పెదబయలులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది



సొలభంలో ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ హనుమంతరావు, అంగన్‌వాడీ టీచర్లు



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

దుంబ్రిగుడ/హుకుంపేట/పెదబయలు/జి.మాడుగుల/చింతపల్లి/చింతూరు: అల్లూరి జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలోని దుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, చింతూరు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సీడీపీవోలు తదితరులు మాట్లాడుతూ తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు అందజేయాలన్నారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. డబ్బా పాలు ఇవ్వొద్దని సూచించారు. బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యులు మోహన్, నిఖిల్, విశ్వచైతన్య, సీడీపీవోలు నీలిమ, బాలచంద్రమణిదేవి, జి.సువర్ణమ్మ, విజయగౌరీ, సర్పంచ్ ఐసరం హనుమంతరావు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి, కొండమ్మ, హెల్త్ విజిటర్ కృష్ణవేణి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా: ముగ్గురిపై కేసు



పోలీసులు సీజ్ చేసిన పశువుల అక్రమ రవాణా వ్యాన్

వై.రామవరం: యార్లగడ్డ నుంచి మైదాన ప్రాంతానికి వ్యాన్‌పై అక్రమంగా ఆరు పశువులను(ఎద్దులను) తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా మంగళవారం పశువుల వ్యాన్ పట్టుబడినట్టు తెలిపారు. వ్యాన్‌ను సీజ్ చేసి, పశువులను ఏలేశ్వరం సమీపంలోని గోశాలకు అప్పగించినట్టు చెప్పారు. పశువులను తరలిస్తున్న గోకవరానికి చెందిన మామిడి పవన్‌కుమార్, దేవిపట్నానికి చెందిన మేక శ్రీను, దారగడ్డకు చెందిన శాసం రాఘవరావులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి



సంతోష్ కుమార్ (ఫైల్)

వై.రామవరం: ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగిన మండలంలోని యర్రంరెడ్డిపాలెం పంచాయతీ గండెంపల్లి గ్రామానికి నెరం సంతోష్‌కుమార్(18) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలివి. సెల్‌ఫోన్ పోగొట్టాడని మృతుడి తల్లి మంగమ్మ మందలించగా, మదనపడిన సంతోష్‌కుమార్ పురుగులు మందు తాగాడు. అతనిని ఈనెల 4న రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సిఫార్సుతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి సంతోష్‌కుమార్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

పెట్రోల్ బంకు బురదమయం



చిత్తడిగా మారిన పెట్రోల్ బంకు ప్రాంగణం

దుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంకు బురదమయంగా మారింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంకును ఆనుకొని చేపడుతున్న ఎన్‌హెచ్–516 పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించి మట్టి తీసి వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. దీంతో పెట్రోల్ బంకు ఎదురుగా మట్టి పేరుకుపోయిందని, వర్షం పడడంతో చిత్తడిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. వాహనచోదకులు జారిపడి గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



అనంతగిరిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ జ్ఞానేశ్వరి



పెదబయలులో సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న కళాజాత కళాకారులు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండల కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియాపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూళలకు అందరూ కృషి చేయాలని వైద్యాధికారిణి జ్ఞానేశ్వరి తెలిపారు, మండల కేంద్రంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో మంగ్లవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐటిడిఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో సెకిల్‌సెల్ ఎనీమియాపై కళాజాత కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పెదబయలు: ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సికిల్ సెల్ ఎనీమియాపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.నిఖిల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా వి.ఎస్.ఆర్. గ్రూపునకు చెందిన కళాకారుల ద్వారా కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా నాటికలు, పాటల రూపంలో సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాసరావు, చిరంజీవి.వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

160 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



గిరిజనులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

అరకులోయ రూరల్: మండలంలోని గన్నెల పీహెచ్‌సీలో మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కమల కుమారి ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్టు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కమలకుమారి మాట్లాడుతూ శిబిరంలో సుమారు 160 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశామన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించామన్నారు. ఎటువంటి వ్యాధి లక్షణాలున్నా తక్షణమే సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను కలిసి చికిత్స పొందాలన్నారు. డాక్టర్లు నాయుడు, మణికంఠ, గౌతమ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పశుదాణా పంపిణీ



పశుదాణా పంపిణీ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ అభిరామ్, నాయకులు

కూనవరం: మండలంలోని కూనవరం, చూచిరేవులగూడెం, కరకగూడెం, పోచవరం, చినార్కూరు సచివాలయాల పరిధిలో రైతులకు మంగళవారం పశుదాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రంగమ్మ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వర్షాలు, వరదల మూలంగా పశువులకు పశుగ్రాసం దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ మేరకు పశుదాణా పంపిణీ జరుగుతుందన్నారు. వెటర్నరీ వైద్యాధికారి మాధవీలత మాట్లాడుతూ సోమవారం 25 టన్నులు, మంగళవారం 25 టన్నులు పశుగ్రాసం పంపిణీ చేశామన్నారు. చినార్కూరు, చూచిరేవుల సర్పంచ్‌లు సున్నం అభిరామ్, తెల్లం నిరోషా, కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాస్

చింతపల్లి: మండలంలోని లంబసింగి, చౌడుపల్లి పంచాయతీల్లో ఈ-పంట నమోదుపై గిరిజన రైతులకు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ , ఉద్యాన పంటలకు సంబంధించి ప్రతి పంటనూ అధికారికంగా ఈ-పంట యాప్‌లో గిరిజన రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల రైతులకు పలు పథకాలు, రాయితీలతో పాటు ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన పంటలకు పరిహారం అందుతుందన్నారు. రైతులంతా సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

వంతెనలు నిర్మించాలని ఆందోళన



గుంజివాడ గెడ్డలో గిరిజన సంఘ నాయకుల ఆందోళన

పెదబయలు: మండలంలోని జామిగుడ, గిన్నెలకోట, ఇంజరి పంచాయతీల్లో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయని వెళ్లేందుకు తాత్కాలిక రవాణా వ్యవస్థను ఏర్పాటును చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. మంగళవారం జామిగుడ పంచాయతీ గుంజివాడ గెడ్డను పరిశీలించారు. గెడ్డ దాటడానికి ప్రజలు ప్రాణాలుపణంగా పెట్టి తప్పని పరిస్థితిల్లో దాటుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు గెడ్డలపై వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం రూ.2 కోట్ల మంజూరు చేసిందన్నారు. ఆయా పనులు నిలిచిపోయాయని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గెంజివాడ గెడ్డలో నాయకులు దిగి ఆందోళన చేశారు. నాయకులు సన్నిబాబు, నర్సయ్య, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరకుల తనిఖీ



అమీనాబాద్‌లో బియ్యం సరఫరాను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ



పెదగార్లపాడు రేషన్ డిపోలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ సత్య సులోచన

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్, కొమరాపురంలలో ఎఫ్‌పీ షాపులు, బియ్యం సరఫరా (ఎండీఎస్) వాహనాలను మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరికి రేషన్ సక్రమంగా అందుతున్నది లేనిదీ పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు.

గంగవరం: మండలంలోని పలు జీసీసీ రేషన్ డిపోలను తహసీల్దార్ సత్య సులోచన ఆధ్వర్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌భాషా (జిలానీ) సందర్శించారు. రికార్డులను తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా పెద్దగార్లపాడు రేషన్ డిపోను సందర్శించి స్టాక్‌ను పరిశీలించారు. రేషన్ వాహనాల ద్వారా సరకుల పంపిణీపై ఆరా తీశారు.